చిన్న ఆలయాలకు కొత్త కళ

ధూపదీప నైవేద్యాల సాయం పెంపు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఒక్కో హామీని నెరవేరుస్తోంది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు సాయం పెంచారు. 2015లో తెదేపా హయాంలో రూ.2,500గా ఉన్న సాయం రూ.5 వేలు చేశారు. ఇప్పుడు ఆ సాయాన్ని రెట్టింపు చేస్తూ తొమ్మిదేళ్ల తర్వాత చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల నుంచి ఆలయాలకు నగదు అందనుంది.

ధూపదీప నైవేద్యాలు పొందుతున్నవి: 195
ప్రస్తుతం అందించనున్నది: రూ.10 వేలు
గతంలో ఇచ్చింది: రూ.5 వేలు
ఆలయాలు: 304

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 304 వరకు చిన్న, పెద్ద ఆలయాలు ఉన్నాయి. వీటిలో ఆదాయం లేని, వార్షికాదాయం రూ.50 వేలు లోపు ఉన్నవి వందల్లోనే ఉన్నాయి. ఆయా చోట్ల దాతలు కమిటీగా ఏర్పాటై అర్చకులను నియమించుకున్నారు. మరికొన్ని చోట్ల పండగలు, వార్షికోత్సవాల సమయంలో అర్చకులను పిలిపించి పూజలు చేస్తున్నారు. ఆలయాలకు శిఖర ప్రతిష్ఠ చేసే నిత్యం ధూప, దీప, నైవేద్యాలు పెట్టాలి. అయినా చాలా ఆలయాలు ఆ సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాయం పెంచడంతో 195 కోవెలలకు మేలు చేకూరనుంది.


ఎంపికైన బాలగుడబలోని రామాలయం

నిబంధనలు ఇవీ..

- ఆలయం 25 ఏళ్ల క్రితం నిర్మించి దేవదాయ శాఖ చట్ట పరిధిలో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో పురాతన ఆలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.
- 2.5 ఎకరాల్లోపు చిత్తడి లేదా 5 ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30 వేలలోపు ఆదాయం సమకూరే వాటికి పథకం వర్తిస్తుంది.
- పూజారుల ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు జరిగే గ్రామ దేవతల దేవాలయాలను పరిగణనలోకి తీసుకుంటారు.
- పెంచిన మొత్తం అర్చకుల ఖాతాకు చేరనుంది. పది వేలలో అర్చకులకు రూ.7 వేలు, ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు.

జిల్లాలో ఎంపికైనవి

నియోజకవర్గం	దేవాలయాలు
పార్వతీపురం	40
కురుపాం	71
పాలకొండ	70
సాలూరు	14

పక్కాగా కార్యక్రమాలు

దేవాలయాల్లో నిత్యం ధూప, దీప, నైవేద్యాల కార్యక్రమాలు పక్కాగా జరిగేలా చూస్తున్నాం. ప్రస్తుతం వీటికి అందిస్తున్న ఆర్థిక సాయం రెట్టింపు చేశారు. దీంతో చిన్న ఆలయాలకు మేలు జరుగుతుంది.

- రాజారావు, డీఈవో, పార్వతీపురం



ఉత్సాహంగా యోగా పోటీలు: జిల్లా కేంద్రంలోని బాలికల ఆర్సీఎం పాఠశాల ఆవరణలో బుధవారం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి యోగా ఎంపికలు జరిగాయి. రెండు జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.. అండర్-14, 17 విభాగాల్లో ఏడుగురు చొప్పున (బాలురు, బాలికలు వేర్వేరుగా) అర్హత సాధించారు. వీరు త్వరలో నెల్లూరులో జరగనున్న పోటీల్లో పాల్గొంటారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గిరిజనులకూ స్వచ్ఛ జలం

- జన్‌మన్‌లో రూ.568 లక్షలు విడుదల
- 114 గ్రామాల్లో పనులు



పార్వతీపురం, న్యూస్‌టుడే: జన్‌మన్ పథకంలో రహదారులు, వైద్యం, విద్య, తాగునీరు, స్వయం ఉపాధి, గృహ నిర్మాణం, అంగన్‌వాడీలు, పాఠశాల భవనాలు, విద్యుత్తు, సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ప్రధాన ఉద్దేశం. తాజాగా పీవీటీజీ గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించడానికి రాష్ట్రంలో రూ.2,993.43 లక్షలు మంజూరు చేశారు. ఇందులో జిల్లాలోని 114 గ్రామాల్లో కొత్తగా తాగునీటి పథకాలు ఏర్పాటు చేయడానికి, గతంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయడానికి నిధులు వచ్చాయి. ఇందులో కొత్త పనులకు రూ.414 లక్షలు కేటాయించారు. అసంపూర్తి పనులు పూర్తికి రూ.154 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ మొత్తంతో గిరిజనులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించనున్నారు.

మండలాల వారీగా ఇలా..

మండలం	పనులు
సీతంపేట	105
భామిని	01
గుమ్మలక్ష్మీపురం	03
కురుపాం	01
వీరఘట్టం	01
పాలకొండ	01

మన్యంలో స్వచ్ఛమైన జలం దొరకడం గగనమే.. కొండల్లో ఊటబావులే ప్రధాన ఆధారం. ఆ నీరు తాగడంతో గిరిజనుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకంతో వారికి స్వచ్ఛమైన నీరు అందించనుంది.

పల్స్ సర్వేలో ఏముంది?

జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న 452 పంచాయతీల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉద్యోగులతో కాకుండా, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో సర్వే చేయించారు. జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారం జిల్లాలో ఏ మేరకు వాస్తవమో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ ప్రకారం జిల్లాలో 2,253 ఆవాసాల్లో 2,21,144 కుటుంబాలు ఉన్నాయి. సర్వేలో మాత్రం 2,32,676 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. ఇందులో 1,45,372 ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు కాలేదని గుర్తించారు. కొంత సమాచారం నివేదికతో సరిపోలకపోగా, మరికొంత తప్పుగా ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ సరిచూసిన తర్వాత పనులు ప్రారంభించనున్నారు.


ఆ తర్వాత ప్రారంభం

జన్‌మన్ పథకం కింద మంజూరైన పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయి. పాలనాపరమైన, సాంకేతిక ఆమోదం పొందడం, టెండర్లు పిలిచి ప్రారంభించడమే తరువాయి. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం చేపట్టాల్సిన తాగునీటి పనులకు మాత్రం ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే ఆ శాఖ జల్‌జీవన్‌లో ఇంటింటికి కుళాయిలు పనులు చేపట్టింది. దీని అమలుపై కూటమి ప్రభుత్వం పల్స్ సర్వే నిర్వహించింది. అది పరిశీలించిన తర్వాత మాత్రమే అసంపూర్తి, కొత్త పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.


భామిని మండలం రేగిడిలో గిరిజనులు వినియోగిస్తున్న తాగునీటి ఊటబావి

కలెక్టర్ దిశానిర్దేశం: తాగునీటి కల్పనకు మంజూరైన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించే దిశగా కలెక్టరు దిశానిర్దేశం చేస్తున్నారు. పల్స్ సర్వేలోని అంశాలను పరిశీలించిన తర్వాతే కొత్త పనులు ప్రారంభించాలి. పీవీటీజీ గ్రామాల్లో చేయాల్సిన పనులకు అడ్డంకి కాకుండా ఉండేలా కలెక్టరు చర్యలు తీసుకోమన్నారు. - ఒ.ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

ఏటా 15 శాతం అభివృద్ధే లక్ష్యం


ధాన్యం కొనుగోలు విధివిధానాలను ప్రదర్శించే గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, అధికారులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి రూపొందించిన దార్శనీయ పత్రంలో పొందుపరిచిన అంశాలన్నింటిలో ప్రగతి చూపించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో దార్శనీయ పత్రంలోని అంశాలపై సమీక్షించారు. ఏటా జిల్లాలో 15 శాతం అభివృద్ధి సాధించాలనే లక్ష్యం దిశగా అన్ని శాఖలు పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రగతి కనిపించాలని ఆకాంక్షించారు. హెక్టారుకు ఐదు వేల కిలోల ధాన్యం దిగుబడి వచ్చేలా ప్రణాళిక ఉండాలని, సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించే దిశగా రైతులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించాలని సూచించారు. పౌర సరఫరాల సంస్థ రూపొందించిన 'రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు' గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి 1967 టోల్‌ఫ్రీ నంబరుకు కానీ 1800 4250082కు కానీ ఫోను చేసి పరిష్కారాన్ని పొందాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోపా.. కొత్త కొలువుల లోకం

- న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం



- ఈ కోర్సుకు పెరుగుతున్న డిమాండు
- కొన్ని కళాశాలల్లో వందశాతం సీట్ల భర్తీ

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు ఇలా..

ఐటీఐ	విజయనగరం	సీతంపేట	రాజాం	సాలూరు
సీట్లు	48	48	48	48
చేరినవారు	48	48	48	23

ఐటీఐ పేరు చెప్పగానే ఒకప్పుడు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్ల పేర్లే ఎక్కువగా వినిపించేవి. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలను దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ కోర్సు (కోపా) అందుబాటులోకి రావడంతో అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు. గత రెండేళ్లుగా ప్రవేశాలకు డిమాండు పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ విద్యకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కొన్ని కళాశాలల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. అంటే ఆ స్థాయిలో డిమాండు ఉందన్నమాట.

పదో తరగతి అర్హతతోనే..

వాస్తవానికి కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్) కోర్సును 2002లోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో చేరేందుకు తొలుత ఇంటర్మీడియట్ విద్యార్హతగా ఉండేది. తర్వాత కాలంలో పదో తరగతికి తగ్గించారు. ప్రారంభంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ కోర్సు ఉందని కూడా చాలామందికి తెలియని పరిస్థితి. కొన్నేళ్లుగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పెద్దఎత్తున చేరుతున్నారు. రెండు జిల్లాల్లో ఆరు ప్రభుత్వ ఐటీఐలున్నాయి. బొబ్బిలి, భద్రగిరి తప్ప.. మిగిలిన నాలుగింట్లో చేరేందుకు అవకాశం ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో నాలుగో విడత కౌన్సెలింగ్ తర్వాత 192 సీట్లలో 167 మంది చేరడం గమనార్హం.


విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఆన్‌లైన్ తరగతుల్లో అభ్యర్థులు


ప్రైవేటులోనూ..

ప్రైవేటులోనూ ప్రవేశాలు పెరిగాయి. గతంలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ కోర్సులే ఉండేవి. రెండేళ్లుగా ఆన్‌లైన్ పరీక్షల విధానం అమల్లోకి రావడం, మారుతున్న కాలానుగుణంగా కంప్యూటర్ కోర్సులు పెడుతున్నారు. చెల్లూరు, కొత్తవలస, గజపతినగరం, ఎల్.కోట మండలాల్లో ప్రస్తుతం కోపా తరగతులు సాగుతున్నాయి. చెల్లూరు ప్రైవేటు కళాశాలలో 24 సీట్లకు 14, కొత్తవలసలో 9, ఎల్.కోటలో 13 మంది ప్రవేశాలు పొందారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల చూపు..

ఇటీవల సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఐటీఐల లక్ష్యంగా ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయి. మేళాల ద్వారా అవకాశాలు కల్పిస్తున్నాయి. జులైలో టీసీఎస్, టెక్ మహీంద్ర వంటి కంపెనీలు నిర్వహించిన ఎంపికల్లో విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో 33 మంది అభ్యర్థులకు ఉపాధి, ఓజేటీ(మూడు నెలల శిక్షణ అనంతరం ఉపాధి పొందేలా) అవకాశాలు లభించాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నీషియన్లు వంటి పోస్టులకు వీరిని ఎక్కువగా తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐటీఐ కంప్యూటర్ చేసే వారికి అప్రంటీస్‌షిప్ అవకాశాలున్నాయి.

సీనియర్ల ద్వారా తెలుసుకున్నా..

కోపా కోర్సు గురించి గతంలో ఎవరికీ తెలియదు. సీనియర్లతో చర్చించి, విద్య, ఉపాధి అవకాశాలు గురించి తెలుసుకున్నాం. కంపెనీల్లోనే కాకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు, అప్రంటీస్ అవకాశాలు ఉండటంతో ప్రవేశాలు పొందాం. తరగతులు బాగా జరుగుతున్నాయి.

- దిల్షన్, విజయలక్ష్మి

తొలిసారిగా అప్రంటీస్



రైల్వే, హెచ్‌ఏఎల్, డీఆర్‌డీవో, నేవీలో రెండేళ్లుగా అప్రంటీస్ అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు సైతం పెద్దఎత్తున ముందుకు వస్తున్నాయి. పదో తరగతి వారే కాకుండా ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కూడా ప్రవేశాలు పొందారు.

- టి.వి.గిరి, కన్వీనరు, ఐటీఐ విద్య

ఉచిత బియ్యం.. మరో నాలుగేళ్లు!

ఉమ్మడి జిల్లాలో 8,09,831 మందికి లబ్ధి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం అందజేస్తోంది. కరోనా విపత్తు కాలం 2020 ఏప్రిల్ నుంచి అమలవుతోంది. కుటుంబంలో ఒకరికి అయిదు కిలోల చొప్పున ఇస్తున్నారు. తొలుత రెండేళ్లు అని ప్రకటించినా పొడిగిస్తూ వచ్చింది. మళ్లీ 2028 వరకు పథకాన్ని కొనసాగిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే ప్రకటించారు. దీంతో పేదలకు ఇంకో నాలుగేళ్లు ఉచిత బియ్యం అందనున్నాయి.


రేషన్ వాహనం ద్వారా పంపిణీ

జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద రేషన్ కార్డుదారులకు ఈ పథకం వర్తిస్తోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 8,62,939 మంది కార్డుదారులు ఉండగా ఇందులో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారులు 8,09,831 మంది ఉన్నారు. వీరందరికీ ప్రయోజనం కలగనుంది. రెండు జిల్లాల కార్డుదారులకు నెలకు 14,374.93 మె.ట. బియ్యం అవసరం. మిగిలిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇటువంటి వారు ఉమ్మడి జిల్లాలో 53,108 మంది మాత్రమే ఉన్నారు. తెదేపా హయాంలో రూపాయికి కిలో బియ్యం పథకం అమలయ్యేది. కేంద్రం ఉచితంగా అందజేస్తున్నందున గత ప్రభుత్వం 2023 జనవరి నుంచి ఈ పథకాన్ని నిలిపివేసి, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులు లేని వారికి బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదనరావు తెలిపారు.

జిల్లా	మొత్తం కార్డులు	ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ	నెలవారీ కేటాయింపు (మె.ట.)
విజయనగరం	5,81,688	5,47,098	9,159.765
మన్యం	2,81,251	2,62,733	5,215.165

ఈనాడు-పార్వతీపురం మన్యం

దుకాణం దొరకలే

ఎక్కువ అద్దె డిమాండ్

ఉమ్మడి జిల్లాలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలు పొందిన వారు బుధవారం నుంచి తెరుచుకోవచ్చు. విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 దుకాణాల్లో అమ్మకాలకు ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇచ్చారు. చాలా మందికి దుకాణాలు దొరకలేదు. విజయనగరం, పార్వతీపురం, సాలూరు సహా పురపాలక, పట్టణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో పెద్ద మొత్తంలో అద్దె డిమాండ్ చేస్తున్నారు. విజయనగరంలో నెలకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.40 వేలు అడుగుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలను కొంతమంది తీసుకున్నారు.



రూ.8 కోట్ల సరకు విడుదల

ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలున్నాయి. వీటిలో పూర్వపు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని 173 దుకాణాలకు నెల్లిమర్ల ప్రభుత్వ మద్యం డిపో నుంచి సరకు సరఫరా అవుతోంది. మిగిలిన వాటికి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డిపో నుంచి పంపిస్తారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు 173 దుకాణాల్లో 101 దుకాణాలకు సరకు తీసుకెళ్లారు. తొలి రోజు రూ.8 కోట్ల విలువైన 11,637 మద్యం బాక్సులు విడుదల చేశారు. మరికొందరు నగదు చెల్లించి ఇండెంట్ సిద్ధం చేసుకున్నారు. ఏ క్షణంలో దుకాణం దొరుకుతుందో ఆ మరుక్షణం తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

జే బ్రాండ్లకు చెల్లు

వైకాపా ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం తాగి ఆరోగ్యం గుల్ల చేసుకున్నారు. పాత సరకు కాకుండా నాణ్యమైన కొత్త బ్రాండ్లు అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. క్వార్టర్ బాటిల్ రూ.99కు విక్రయిస్తామని ప్రకటించింది. ఒకటి, రెండు రోజుల్లో కనిష్ఠ ధరకు దొరికే మద్యం సీసాలు వస్తాయని నెలిమర్ల ప్రభుత్వ మద్యం డిపో మేనేజరు గౌరీశ్వరరావు 'ఈనాడు'కు తెలిపారు.

తెరుచుకున్నవి 15.. మూసినవి 30

పార్వతీపురం, న్యూస్‌టుడే: కొత్త మద్యం విధానంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులు లాటరీ ద్వారా పొందిన 52 దుకాణాల్లో బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభించారు. రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాత అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 15 దుకాణాలు మాత్రమే తెరుచుకున్నాయి. మద్యం నిల్వలు తీసుకువచ్చేందుకు యాజమానులు అందరూ ఒకేసారి గోదాములకు వెళ్లడం, ఇండెంట్లు పెట్టడం వంటి కారణాల నేపథ్యంలో జాప్యం జరుగుతుందని సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కిశోర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గురు, శుక్రవారాల్లో దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభించే వీలుందని చెబుతున్నారు.

జిల్లాలో 53 దుకాణాలను ప్రభుత్వం నిర్వహించేది. వీటిని మూతవేయాల్సి రావడంతో బుధవారం 30 మూసివేశారు. ప్రభుత్వ నిర్వహణ కారణంగా ప్రతి పైసాకు లెక్క చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సంయుక్త కలెక్టరు శోభిక దుకాణాలను పరిశీలించారు. ఇంకా రెండు రోజులు గడువు ఇచ్చినప్పటికీ గురువారానికి 53 దుకాణాల లెక్కలు చూసి, మూసివేసేదిశగా చర్యలు తీసుకుంటామని జీవన్‌కిశోర్ చెప్పారు.

ఏమైంది

- రైలు పట్టాలపై పోక్సో కేసు నిందితుడు
- చంపి పడేశారంటూ తల్లిదండ్రుల ఫిర్యాదు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పోక్సో కేసు నమోదైన యువకుడు పార్వతీపురంలో రైలు పట్టాలపై శవమై బుధవారం కనిపించాడు. కాగా తమ కుమారుడిని హత్య చేసి, పట్టాలపై పడేశారని మృతుడి తల్లిదండ్రులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పార్వతీపురం మండలానికి చెందిన యువకుడు (18) విజయనగరంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికతో చనువుగా ఉండేవాడు. తన కుమార్తెతో మాట్లాడొద్దని ఆమె తల్లి చెప్పింది. అయినా మాట్లాడుతుండటంతో బాలిక తల్లి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 14న పోక్సో కేసు పెట్టింది. దీంతో యువకుడు తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామున రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి శవం ఉన్నట్లు తెలియడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా తమ కుమారుడిది అని తండ్రి గుర్తించారు. అతడి పొట్ట, ముఖంపై గాయాలు ఉన్నాయని, బాలిక తల్లిదండ్రులు హత్య చేసి, పట్టాలపై పడేశారని ఫిర్యాదు చేయడంతో రైల్వే హెచ్‌సీ డి.రత్నకుమార్ కేసు నమోదు చేశారు. రైల్వే ఎస్సై రవి వర్మ దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ సీఐ గోవిందరావు వద్ద ప్రస్తావించగా యువకుని మృతిపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు

ఉన్నత చదువులు చదివి ఇంటికి ఆసరాగా ఉంటాడనుకున్న కుమారుడు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యువకుని శవాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా బంధువులు అధిక సంఖ్యలో చేరుకున్నారు.

పైడితల్లి ఆలయానికి రూ.2.40 లక్షల విరాళం


అదితి చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న కామేశ్వరరావు కుటుంబ సభ్యులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃని ర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షరామానికి చెందిన మాకం కామేశ్వర రావు, అతని కుమారులు రూ.2.40 లక్షల విరాళాన్ని అందజేశారు. బుధవారం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతి రాజు చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వ హణ అధికారికి ఇచ్చారు. పెద్ద చెరువులో బెస్తవారి వలలో అమ్మవారి విగ్రహం ప్రత్య క్షమైందని, వారే మొదటగా విరాళాన్ని ఇవ్వడం సంతోషదాయకమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో కమ్మవీధికి చెందిన అమ్మవారి బెస్తవారి వల ఉత్సవ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐదు తరగతులు.. ముగ్గురే విద్యార్థులు

జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎ.రావివలస పంచాయతీ నారుపేట ప్రాథమిక పాఠశాల రేకుల షెడ్డులో కొనసాగుతోంది. అయిదు తరగతులకు అను మతి ఉన్నప్పటికీ ప్రస్తుతం ముగ్గురే విద్యార్థులున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భవనం కోల్పోవడంతో ఒక్కొక్కరిగా ఈ పాఠశాలను వీడి విద్యార్థులు ఇతర విద్యా లయాలకు వెళ్లిపోయారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని, వసతి సమస్య వల్ల చేరడం



లేదని ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు తెలిపారు. దీనిపై ఎంఈవో రమణమూర్తి వద్ద ప్రస్తావించగా ఇక్కడ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

– న్యూస్‌టుడే, భోగాపురం

జీవనోపాధులు కల్పించే దిశగా చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద అన్ని వర్గాలకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, జీసీసీ, పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడారు. ఉపాధి కల్పన పథకాల ద్వారా లబ్ధిదారులు స్థిర ఆదాయాన్ని పొందేలా చూడాలన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాలు స్ఫూర్తివంతంగా పనిచేయాలన్నారు. ఈ నెలాఖరుకు ప్రతి మండలంలో ఒక యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, నవంబరు 17 నాటికి ప్రారంభించాలన్నారు. 500 కుటుంబాలకు గొర్రెల పెంపకం ద్వారా ఉపాధి కల్పించేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు. ఏపీవోలు చినబాబు, మురళీధర్, జీసీసీ డీఎం మహేంద్రకుమార్, పరిశ్రమల శాఖ అధికారి కరుణాకర్, పశుసంవర్ధక శాఖ ఏడీ మన్మథరావు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.

వచ్చే జనవరికి పనులు పూర్తవ్వాలి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కొత్తగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా డెంకాడ మండలం పెదతాడివాడలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నాగమాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో మొత్తం 265 పనులకు సుమారు రూ.24 కోట్లు కేటాయించారని, మిగిలిన పనులకు రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, డ్వామా పీడీ సందీప్, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

సృజన.. విజ్ఞాన శోధన



విద్యార్థులు తమ సృజనకు పదును పెడుతున్నారు. ఆలోచనలను ప్రాజెక్టులుగా ఆవిష్కరిస్తున్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అద్దం పడుతున్నాయి. ఇటీవల జరిగిన విజయనగరం ఉత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన పలు పాఠశాలల వారు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి ఔరా అనిపించారు.

– న్యూస్‌టుడే, విద్యావిభాగం, ఉడాకాలనీ

ఏఐతో సాంకేతిక ఇల్లు



కృత్రిమ మేధ పరిజ్ఞానంతో సాంకేతిక ఇంటిని రూపొందించాం. వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడేలా తయారు చేశాం. ఇంట్లో ఉండే వివిధ రకాల పరికరాల(పంకాలు, శీతలీకరణ యంత్రాలు తదితరాలు)ను నియంత్రించడం ద్వారా విద్యుత్తు ఆదా చేయవచ్చు. మన మాటల ద్వారా కార్యకలాపాలు సాగించవచ్చు. – బి.లోకేశ్, కె.యామిని, ఎం.వైష్ణవి, మహారాజా ఎయిడెడ్ కళాశాల

గాలి కాలుష్య నివారణ ఇలా..



ప్రపంచవ్యాప్తంగా గాలి కాలుష్యం బారిన పడి ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రధానంగా కర్మాగారాల్లో వచ్చే విషపూరిత వాయువులు గాలిని కలుషితం చేస్తున్నాయి. మానవులతో పాటు పశుపక్ష్యాదులు మరణిస్తున్నాయి. వాహనాల ఉపయోగాన్ని తగ్గించి, చెట్లను నరకకుండా చూడడం ద్వారా భవిష్యత్తులో ఈ కాలుష్యం నుంచి బయటపడే విధానాన్ని ప్రయోగపూర్వకంగా తెలియజేశాం.

– ప్రవల్లిక, వేణుమాధవి, 8వ తరగతి, గాజులరేగ జడ్పీహెచ్ఎస్

రైలు ప్రమాదాల నివారణ



ఇటీవల కాలంలో రైలు ప్రమాద ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఇలాంటి వాటిని నివారించే విధానాన్ని ప్రాజెక్టు రూపంలో తెలియజేశాం. సెన్సర్లు ఉపయోగించి ప్రమాదాలు జరగకుండా చూడొచ్చు. ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు వచ్చేటప్పుడు ముందస్తుగా సిగ్నళ్లు వచ్చేలా వివిధ రకాల పరికరాలు పెట్టాం. దీంతో ముందుగానే అప్రమత్తం కావొచ్చు.

– బి.చరిష్మా, ఎన్.దీపిక, పదో తరగతి, అక్లాండ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, పూసపాటిరేగ

విపత్తుల వేళ అప్రమత్తత



వరదలు వచ్చేటప్పుడు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం ప్రాజెక్టు లక్ష్యం. జీఎస్ఎం సిమ్ (మాడ్యూల్)ను ఉపయోగించి చరవాణి ద్వారా సంక్షిప్త సమాచారాన్ని చేరవేయొచ్చు. రెండు కిలోమీటర్ల వరకు సైరన్ మోగి నష్టం జరగకుండా చూస్తుంది. – పి.మహేష్, కుమారస్వామి, పదో తరగతి, జడ్పీహెచ్ఎస్, రామతీర్థం

ఈ-వాహనాలు



పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న మోటారు వాహనాలతో కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణ పరంగా హాని జరుగుతున్నందున వాటి స్థానంలో విద్యుత్తు వాహనాలు ఉపయోగించాలి. తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ- వాహన పథకం కింద ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తూ.. ప్రత్యేక ప్రదర్శన నిర్వహించాం.

– పావని, పుష్పలత, మీనాక్షి, బీబీఏ ద్వితీయ సంవత్సరం, ఎంఆర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌స్టడీస్

మనుషులతో పనిలేకుండా..



ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాలు గానీ, యంత్రాలు, ఇతరత్రా పరికరాలను ఆర్డరు చేస్తే మానవ ప్రమేయంతో అందిస్తున్నారు. మా ప్రాజెక్టుతో మానవ ప్రమేయం లేకుండా ఆయా పనులు చేపట్టవచ్చు. పెట్రోల్, డీజిల్‌తో పాటు సోలార్ ఉపయోగించి సెన్సర్లు, కంప్యూటర్ కోడింగ్ ద్వారా నిర్వహించే విధానాన్ని రూపొందించాం. – వినయ్‌రెడ్డి, కృష్ణ సమీర్, ఏఐఏటీ జూనియర్ కళాశాల, విజయనగరం

చిరుధాన్యాల గురించి తెలిసేలా..



ఆహారోత్పత్తుల్లో వరి, గోధుమ స్థానంలో జొన్నలు, సజ్జలు, రాగులు, చోడి వంటి చిరుధాన్యాలకు ఇటీవల కాలంలో డిమాండు పెరుగుతోంది. పోషకాలు ఎక్కువగా ఉండడంతో మొగ్గుచూపుతున్నారు. వాటిలో ఉండే పోషకాలు, సాగు చేసే విధానాన్ని సవివరంగా తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించాం.

– కె.స్వప్న, జి.స్నేహ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం, మహారాజా కళాశాల

డెంగీ అనుమానిత కేసులపై ప్రత్యేక దృష్టి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డెంగీ అనుమానిత కేసులు వస్తే ఉన్నత ఆరోగ్య కేంద్రానికి తరలించి, వారి ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక దృష్టి ఉంచాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ కోరారు. బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారి శశిధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుభద్ర ఉపకేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. విస్తరణాధికారి నారాయణరావు, రాజేశ్వరి, సామాజిక ఆరోగ్య అధికారి శారద, ఆరోగ్య కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

'మా భూమిని ఎమ్మెల్యే ఆక్రమిస్తున్నారు'

లోకం నాగమాధవిపై దళితుల ఆరోపణ


గోడ నిర్మాణ పనులు అడ్డుకున్న దళితులు, స్థానికులు

పూసపాటిరేగ/భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలం ముంజేరు పరిధిలోని తమ భూమిని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆక్రమించడానికి యత్నిస్తున్నారని స్థానిక దన్నానపేట దళితులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. గ్రామ సర్వే నంబరు 338-4లో 56 సెంట్ల భూమి తండ్రి దన్నాన రాముడు నుంచి వారసత్వంగా అతని కుమారుడు శ్రీనివాసరావుకు వచ్చింది. ఆ భూమిని ఆనుకుని ఎమ్మెల్యేకు చెందిన మిరాకిల్ విద్యాసంస్థల భవన సముదాయం ఉంది. మూడేళ్ల కిందట భూ యజమాని రాముడు మృతి చెందారు. ఆరు నెలల కిందట అతని సంతకం ఫోర్జరీ చేసి రెవెన్యూ దస్త్రాల్లో మార్పులు చేశారని కుమారుడు, దళితులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఆ భూమిలో గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు మిరాకిల్ సంస్థ ప్రతినిధులు అధికారులను తీసుకొని బుధవారం రాగా.. స్థానికులు అడ్డుకోగా వెనక్కి వెళ్లిపోయారు. తమ గ్రామానికి చెందిన కొంత మంది దళితుల భూములను కూడా ఎమ్మెల్యేకు చెందిన సంస్థ పేరిట దస్త్రాల్లో మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారని ఆరోపించారు. దీనిపై మిరాకిల్ సంస్థ ఎస్టేట్ డైరెక్టర్ వెంకట్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఆ భూమి మిరాకిల్ సంస్థకు చెందిందని అన్నారు. అందులో గోడ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై భోగాపురం తహసీల్దారు సురేష్ మాట్లాడుతూ భూమి వివాదం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. భూహక్కు పత్రాలు పరిశీలించి, సర్వే చేపడతామని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తండ్రి పెద్దకర్మ.. తనయుడి మృతి

● గాయత్రీనగర్ కాలనీలో విషాదం


రామినాయుడు


చంద్రశేఖర్

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ కుటుంబంలో రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. తండ్రి దినకార్యానికి సిద్ధమవుతున్న తరుణంలో ముందురోజు రాత్రి కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. పాలకొండ పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన విశ్రాంత ఎంఈవో పొదిలాపు రామినాయుడు (79) ఈ నెల 6న అనారోగ్యంతో మృతిచెందారు. 11వ రోజు కర్మకాండ నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు బుధవారం ఏర్పాట్లు చేసుకున్నారు. ఈలోగా ఆయన కుమారుడు పొదిలాపు చంద్రశేఖర్ (42) బుధవారం వేకువజామున అకస్మాత్తుగా మృతి చెందారు. తండ్రి కర్మ కాండలు చంద్రశేఖర్ నిర్వహించారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురై తండ్రి దినకార్యం రోజునే తనువు చాలించారు. ఈయన పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వంగర మండలానికి చెందిన రామినాయుడు గత కొద్ది సంవత్సరాలుగా గాయత్రీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఓ వైపు ఇంటి పెద్దను కోల్పోవడం, ఆదుకోవాల్సిన కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ఆసుపత్రిలో క్షతగాత్రులు

పార్వతీపురం పట్టణం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలంలో బుధవారం బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. వీరఘట్టానికి చెందిన ఆటో ప్రయాణికులతో పార్వతీపురం వస్తుండగా పిట్టలమెట్ట సమీపంలో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వై.యశోదమ్మ(47) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో మృత్యువాత

పాచిపెంట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన పాచిపెంట మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట సురేష్ వివరాల మేరకు.. పాంచాలికి చెందిన సి.లక్ష్మణరావు(53) బుధవారం ఉదయం తన భార్య సూరమ్మతో కలిసి కాలనీలోని మేకలశాలకు వెళ్లారు. అక్కడ వంట చెరకుపై ఉన్న ప్లాస్టిక్ సీసాను తీస్తుండగా పాము కాటువేసింది. కుటుంబీకులు సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

క్వారీ గోతిలో పడి కార్పెంటర్ దుర్మరణం


సోమరాజు (పాత చిత్రం)

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని బర్మాకాలనీకి చెందిన కార్పెంటర్ కర్రి సోమరాజు (49) బుధవారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ క్వారీ గోతిలో పడి మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ వి.నారాయణమూర్తి అందించిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెతకగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీ వద్ద నీటి గొయ్యిలో శవమై తేలి ఉన్నాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడి చనిపోయినట్లు గుర్తించి భార్య జోగేశ్వరి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ పీవీ ఆనందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతని భార్య దివ్యాంగురాలు కాగా ఓ కూతురు ఉంది. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం ఆధారం లేనిదైంది.

కోనేరులో స్నానానికి వెళ్లి..

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కోనేరులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బాడంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాడంగి ఎస్సీకాలనీకి చెందిన కంది రమేష్ (52) బీసీ కాలనీలోని కోనేరులో బుధవారం ఉదయం స్నానానికి దిగారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా కోనేరులో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు నమోదు చేశామన్నారు.

పట్టాలు దాటుతూ..

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండల కేంద్రంలోని హడ్కో కాలనీ సమీపంలో పాత రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉండొచ్చని చెప్పారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ఉన్నట్లు ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

ఎస్సీఈఆర్టీలో అవకాశాలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ)లో ఫారిన్ సర్వీసు కింద పనిచేయడానికి ఆసక్తి ఉన్న డైట్ సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. సెప్టెంబరు 28 నాటికి 15 ఏళ్ల అనుభవం, 58 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని, ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల్లో నెలవారీ జీతం 010 పద్దు నుంచి డ్రా చేసినవారు మాత్రమే అర్హులని తెలిపారు.

అవకాశమివ్వాలి: యూటీఎఫ్

ఎస్సీఈఆర్టీలో డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించే అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఆర్‌సీ పట్నాయక్, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జడ్పీ, ప్రభుత్వ ఉపాధ్యాయులు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొనడం సరికాదని, సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

న్యూస్‌టుడే- రాజాం

ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధికి బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాలకు ఆధార్ తప్పనిసరైంది. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోయినా.. అందులో సాంకేతిక తప్పిదాలు ఉన్నా.. తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండాలని, ఇప్పటికే తీసుకుని చాలా కాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా.. చాలా మంది ముందుకు రావడం లేదు. ఆధార్ అవసరమైనప్పుడు ఆ ఇబ్బందులేమిటో తెలిస్తుంది. అప్పుడు ఆదరాబాదరాగా ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి. పదేళ్లుగా వేలిముద్రలు, నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో ఇతర సమాచారాన్ని నవీకరించుకోని వారు జిల్లాలో లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇంటికి చేరువలోనే శిబిరాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినా సద్వినియోగం చేసుకోవడం లేదు. గతంలో పూర్తి స్థాయి సమాచారం పొందుపర్చకపోవడంతో చాలా వరకూ తిరస్కరణకు గురయ్యాయి. గతంలో ప్రత్యేక శిబిరాల్లో నమోదు చేసుకున్నవారు నిర్ణీత ధ్రువపత్రాలు సమర్పించకపోవడం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో 5 నుంచి 10 శాతం తిరస్కరణకు గురైనట్లు గుర్తించారు. తర్వాత సిబ్బందికి శిక్షణ అవసరమని తేల్చారు. ఆధార్ కార్డుకు వయసుతో నిమిత్తం లేదు. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా బాల ఆధార్ తీసుకునే వీలుంది. అయిదేళ్లలోపు పిల్లల వేలిముద్రలు నిక్షిప్తం కావు. అయిదేళ్లు దాటాక వీరంతా బయోమెట్రిక్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వారూ తమ వేలిముద్రలు, కనుపాపలు పునర్ స్వీకరణ (రీక్యాప్చరింగ్) చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ శిబిరాలు కొత్త ఆధార్ కార్డుల నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాలు, ఆధార్‌పై వ్యక్తిగత చిత్రం నవీకరణ, చరవాణి సంఖ్య మార్పు, ఇతర దోషాలు పరిహరించుకునేందుకు దోహదపడతాయి. శిబిరాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. సాధ్యమైనంత ఎక్కువ మంది సేవలు అందుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రధానంగా వీరిదే.

ఈనెల 22 నుంచి ప్రత్యేక శిబిరాలు


చిన్నారి వివరాలు నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్

వేలిముద్రలు నవీకరించుకోవాల్సిన వారు

జిల్లా	5-15 ఏళ్లు	15-17 ఏళ్లు
విజయనగరం	44,776	68,875
మన్యం	38,086	58,461

మంచి అవకాశం

ఆధార్ సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇది మంచి అవకాశం. వేలిముద్రల నవీకరణతో పాటు ఇతర ఆధార్ సమస్యల పరిష్కారానికి ఇవి దోహదపడతాయి.

– నిర్మలాదేవి, ప్రత్యేకాధికారిణి, గ్రామ–వార్డు సచివాలయాలు

ప్రమాదం.. పట్టించుకోని వైనం



వొలుగుడు గ్రామం నుంచి అడ్డాపుశీల వెళ్లే జంఝావతి సాగునీటి కాలువ మార్గంలో గట్టుపై గండి పడింది. జులైలో కురిసిన వర్షాలకు కోతకు గురైంది, ఈ మార్గంలో నాటు బళ్లు, ట్రాక్టర్లు తిప్పలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. జంఝావతి దిగువ కాలువ పర్యవేక్షక డీఈతూ డిల్లీశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకునేలా ఏఈ, సిబ్బందికి సూచిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

రక్షిత నీరు వృథా



పాలకొండ పట్టణ ప్రధాన రహదారిలోని మురళీమోహన్‌నగర్ కూడలిలో రక్షితనీరు వృథాగా పోతోంది. ఈ కూడలిలో అన్ని వీధులకు అనుసంధానించే ప్రధాన పైపు లైను. ఇది మరమ్మతులకు గురికావడంతో నిరంతరం ఇలా వృథాగా రోడ్డు పాలవుతోంది. సిబ్బంది పంపి, తక్షణ చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ ఏఈ దేవీవరప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

రాళ్ల దారిలో రాకపోకలు ఎలా?



కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దురిబిలి కూడలి నుంచి గ్రామం వరకు ఎక్కడికక్కడ రాళ్లు తేలి, ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వాహనాలు పాడైపోతున్నాయని, నడవడానికి వీలు లేకుండా ఉందన్నారు. రహదారి నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభిస్తామని ఏపీవో బావాజీ తెలిపారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గ్రామ సింహాలతో బెంబేలు

గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని ప్రధాన రహదారుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వృద్ధులు, చిన్నారులను గాయపరుస్తున్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహనచోదకుడిపై కుక్క దాడి చేయడంతో అదుపుతప్పి కారును ఢీకొట్టాడు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతామని ఎంపీడీవో పాల్లా నీరాజు తెలిపారు. బలిజిపేట మండల కేంద్రంలోనూ ఇదే పరిస్థితి. చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి అన్నారు. - న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం, బలిజిపేట



భూ సమస్యల పరిష్కారానికే సభలు



దస్త్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు శ్రీవాస్తవ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. లక్ష్మీనారాయణపురం సదస్సులో మాట్లాడారు. భూహక్కుదారుల పాసు పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు, సవరణ ప్రక్రియను పరిశీలించారు. భూవిస్తీర్ణం, రైతుల పేర్లు, చిరునామాల సవరణ చేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దారు జయలక్ష్మి, డీటీ కిరీటీ, ఆర్‌ఐ రామచంద్రారావు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696

? పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సు కూడలి వద్ద చెత్త తొట్టి ఏర్పాటు చేయాలంటూ. - రమేష్, ప్రయాణికుడు
❖ తొట్టి ఏర్పాటుకు చర్యలు చేపడతాం. - ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? పార్వతీపురం పట్టణ శివారులోని యర్రాక్కక్ట కాలనీ బోర్డు చెట్టుకొమ్మల మధ్య ఉంది. దీంతో విశాఖ, విజయనగరం ప్రాంతాల నుంచి అవసరాల నిమిత్తం ఇక్కడికి వచ్చే ప్రయాణికులు బస్సు ఆపే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. - ప్రయాణికులు
❖ బోర్డు చుట్టూ ఉన్న కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - రామారావు, ట్రాన్స్‌కో ఏఈ
- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? పాచిపెంట నుంచి పి.కోనవలస వెళ్లే రహదారికి ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరిగాయి. - వాహన చోదకులు
❖ తుప్పలు, మొక్కలు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. - విజయకుమార్, జేఈ
- న్యూస్‌టుడే, పాచిపెంట

? పుట్టూరు నూతన సచివాలయం ఎదుట ఉన్న ఎస్టీ కాలనీ చేతిపంపు వద్ద నీరు నిలిచి, పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. కాలువ నిర్మించాలి. - గ్రామస్థులు
❖ పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - జీవీఆర్ మూర్తి, ఈవోపీఆర్డీ
- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

పాలకొండ.. సమస్యలు నిండా..!

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ నగర పంచాయతీలో అభివృద్ధి పనులు పడకేశాయి. నిధులు ఉన్నప్పటికీ దాదాపు రెండేళ్లుగా పనులు ముందుకు సాగడంలేదు. నగర పంచాయతీగా పాలకొండ స్థాయి పెరిగి దశాబ్ద కాలం గడిచింది. ప్రస్తుతం 20 వార్డుల్లో దాదాపు 40వేల మంది జనాభా ఉన్నారు. కానీ ఆ స్థాయిలో మాత్రం సౌకర్యాలు లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సిగడి వీధి శివారున అసంపూర్తిగా వంతెన నిర్మాణం

గుత్తేదారుల వెనుకంజతో..

పాలకొండలో అభివృద్ధి పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడంలేదు. గత ఐదేళ్లలో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యంతో ఈ సమస్య ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో సకాలంలో చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డామని పలువురు వాపోతున్నారు. ఇంకా రూ.50 లక్షల వరకు రావాలని చెబుతున్నారు. మళ్లీ అదే పరిస్థితి ఎదురవుతుందన్న కారణంగా టెండర్లు ఖరారైనా పనులు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు.

నిధులున్నా.. సాగని పనులు

పాలకొండ నగర పంచాయతీకి 2023లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.91 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 60 పనులు చేపట్టాలని పాలకవర్గం తీర్మానించింది. వీటిలో ఇప్పటివరకు 36 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 24 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. పారిశుద్ధ్య విభాగానికి సంబంధించి 10 పనులకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల నుంచి రూ.48 లక్షలు ఖర్చు చేసి కాంపాక్టు వాహనం కొనుగోలు చేశారు. మరో తొమ్మిది పనులకు సంబంధించి రూ.1.52 కోట్లు వినియోగానికి నోచుకోవడంలేదు. పట్టణంలో ఎక్కడికక్కడ సమస్యలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సౌకర్యాలు లేక అవస్థలు

నగర పంచాయతీ పరిధిలో పూర్తిస్థాయిలో సిమెంటు రహదారులు, మురుగు కాలువలు లేక పరిస్థితి దయనీయంగా ఉంది. వర్షం పడితే ప్రజలు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. శివారులో సమస్యలు అధికంగా నెలకొన్నాయి. మరోవైపు పాత పట్టణంలో ఏళ్ల క్రితం వేసిన రహదారులు, కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మురుగు వీధుల్లో నిలుస్తోందని, దోమలతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, పాలకవర్గం సమస్యలపై దృష్టిసారించి అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులను కొద్దిరోజుల్లో ప్రారంభిస్తాం. ఇప్పటికే 24 పనులకు సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. ఈ పనులు త్వరలోనే చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.
- దేవీవరప్రసాద్, ఏఈ, నగరపంచాయతీ

కరిరాజులతో భయం భయం



సూరంపేట గోదాముల వద్ద ఏనుగులు

కురుపాం గ్రామీణం, సీతానగరం: సీతంపేట, భామిని ప్రాంతాల్లో సంచరించిన గజరాజులు ఇటీవల కురుపాం మండలంలోని కొండ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. బుధవారం తిత్తిరి పంచాయతీ సీడిగూడ సమీపంలో నాలుగు ఏనుగులు కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంటలు నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మరో ఏనుగుల గుంపు సీతానగరం మండలం సూరంపేట సమీపంలోని బియ్యం నిల్వల గోదాముల పరిసరాల్లో బుధవారం కనిపించాయి. వాటిని తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



సూచనలిస్తున్న జగన్మోహనరావు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: గర్భిణులు, కిశోర బాలికల్లో రక్త హీనత నివారణకు చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీని సందర్శించి, ప్రగతిని తెలుసుకున్నారు. అల్లువాడ, గవరమ్మపేటలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఏ మేరకు వేశారో తెలుసుకున్నారు.

వ్యర్థాలు తొలగించారు

స్పందనకు వందనం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ వెంకటరాయుడు కోనేరు గట్టుపై పేరుకుపోయిన వ్యర్థాలను నగర పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. గట్టు వద్ద చెత్తతో స్థానికుల ఇబ్బందులపై 'ఈనాడు'లో ఈనెల 15న ప్రచురితమైన కథనానికి కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు స్పందించారు.

తాగునీటి యంత్రం అందజేత

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు గత ప్రభుత్వ హయాంలో భారీ రక్షిత నీటి యంత్రాన్ని మంజూరు చేశారు. ఇది కొన్నాళ్లకే మూలకు చేరడంతో విద్యార్థుల అవస్థలపై జులై 31న ఈనాడులో 'రక్షిత నీరు అందించరూ..' శీర్షికన వెలువడిన కథనానికి ఎన్నారై మోహన్‌సుధీర్ పట్టా స్పందించారు. సొంత నిధులతో పాఠశాలకు 165 లీటర్ల రక్షిత నీటి యంత్రాన్ని అందించారు.


ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక తరగతులు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో పగడాలమ్మ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జడ్పీహెచ్ పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుందన్నారు. పరీక్షలంటే భయాన్ని వీడాలని సూచించారు. అనంతరం ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. నాడు-నేడు అసంపూర్తి భవనాల వద్ద ఎరుపు రంగు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అపార్ నంబరు అనుసంధాన ప్రక్రియ జిల్లాలో 14 శాతం పూర్తయినట్లు చెప్పారు. డిప్యూటీ డీఈవో సుగుణ, ఎంఈవో చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు భీముడు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

సీతంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సాధారణ వైద్య పరీక్షలు జరిపించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీవో) జి.చిన్నబాబు అన్నారు. సీతంపేట మండలం పెద్దపొల్ల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, దస్త్రాలు, విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మెనూ పక్కాగా అమలు చేయాలని, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.భాస్కరరావు, ఉపాధ్యాయులు మూటక రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని ఈయూ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు మధ్యాహ్నం డిపో వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో సహాయ మేనేజర్ ఏకపక్ష నిర్ణయాల కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్వరమే ఉద్యోగులందరికీ న్యాయం చేయాలన్నారు. సమస్యలపై యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఆందోళనలో నాయకులు బీవీ రమణ, డీజే బాబు, వై.రామకృష్ణ పాత్రో, సతీష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఈయూ ఉద్యోగులు

నేడే అన్న క్యాంటీన్ ప్రారంభం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రధాన రహదారిలో కోటదుర్గ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ గురువారం ప్రారంభించనున్నట్లు నగర పంచాయతీ కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు.

సృజనాత్మకత మెరుగుపర్చాలి

వీరఘట్టం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపర్చాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. అన్వేషణ శక్తి మెరుగు పడాలన్నారు. విద్యార్థులు విభిన్న కోణాల్లో వర్తమాన అంశాలు ఆలోచించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సరకుల నిల్వలు, దస్త్రాలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: అధిక దిగుబడులపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏడీ నిర్మలాజ్యోతి, రస్తాకుంటుబాయి కేవీకే ఎస్‌ఎంఎస్ వై.ఉమాజ్యోతి అన్నారు. బుధవారం బీజేపురం, అర్నాడలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వరిలో వచ్చే తెగుళ్లు, కీటకాల నివారణ, అధిక పంట దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలు, ఈ-పంట సామాజిక ఆడిట్‌పై అవగాహన కల్పించారు. ఏవో జ్యోత్స్న, రైతులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులంతా పాఠశాలకు రావాలి

సీతంపేట, న్యూస్‌టుడే: దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లిన విద్యార్థులంతా తిరిగి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఐటీడీఏ డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. దోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి, మాట్లాడారు. తక్షణమే విద్యార్థులంతా తిరిగి వచ్చేలా ప్రాంతాలవారీగా కొంత మంది ఉపాధ్యాయులను పంపించాలన్నారు. పాఠశాలలో 310 మంది విద్యార్థులకు బుధవారం ఉదయానికి 190 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఉపాధ్యాయులు పి.విజయేంద్రరావు, ఆర్సీ రెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంతో పట్టణానికి చెందిన ప్రయాణికుడు శివాజీకి తీవ్రగాయాలయ్యాయి. తన కుమార్తెను విజయవాడ తీసుకువెళ్లేందుకు బుధవారం కాంప్లెక్సుకు వస్తున్న సమయంలో శ్రీకాకుళం బస్సు కనిపించింది. ఆర్టీసీ అవుట్‌గేట్ వద్ద బస్సును ఆపి ఎక్కేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో శివాజీ కాలు పైకి టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

యూటీఎఫ్ ధర్నా

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు.

సాగునీటికి అన్నదాతల శ్రమదానం

పాలకొండ, న్యూస్‌టుడే: తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలోని ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందడం లేదంటూ వెలగవాడ పంచాయతీ పరిధిలోని పీఆర్‌రాజుపేటకు చెందిన రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ప్రాజెక్టు చివరి భూములు కావడం, పంట కీలక దశలో ఉండడంతో సాగునీరు అందకపోవడంతో పంటలు నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టినా సాగునీరు అందక పంటలు పంటలు ఎండిపోతున్నాయన్నారు. తోటపల్లి ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ శివారు ప్రాంతాలకు కనీస స్థాయిలో సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతులంతా కలిసి గుడివాడ నుంచి తోటపల్లి కాలువలో శ్రమదానంతో పూడిక తొలగించారు.



కాలువలో పూడిక తొలగిస్తున్న రైతులు

7 కి.మీ.. ఆపసోపాలు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట నుంచి పి.కోనవలస చెక్‌పోస్టు కూడలి వరకు ఉన్న 7 కి.మీ బీటీ రహదారి అధ్వానంగా తయారైంది. సాలూరు, ఒడిశా వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. దారంతా పెద్ద గోతులు ఉన్నాయి. చాలాచోట్ల మలుపుల్లోని తారు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అమ్మవలస గ్రామ పోలందేవి చెరువు మలుపులో భారీ గొయ్యి ఏర్పడింది. కర్రివలస వద్ద ఇదే పరిస్థితి. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల కూడలిలోని గొయ్యి వల్ల చోదకులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. రూ.50 లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని ర.భ.శాఖ జేఈ విజయకుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



అమ్మవలస గ్రామం సమీపంలో గోతులు

బాధ్యతల స్వీకరణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం తహసీల్దారుగా శేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన అప్పారావు బదిలీపై వెళ్లడంతో పార్వతీపురంలో పనిచేస్తున్న శివనారాయణను నియమించారు. ఆయన విధుల్లో చేరకపోవడంతో ఇటీవల భామిని నుంచి బదిలీపై వచ్చిన హెచ్‌డీటీ శేఖర్‌ను ఎఫ్‌ఏసీ తహసీల్దారుగా నియమించారు.

పుస్తకాల పంపిణీ

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం సన్నద్ధం అవుతున్న కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'యస్' సొసైటీ ఆధ్వర్యంలో 'యూత్ ఫర్ సేవ' సంస్థ సహకారంతో బుధవారం స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావు, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగాలకు 54 దరఖాస్తులు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బలిజిపేట కేజీబీవీ పాఠశాలలో బోధనేతర సిబ్బంది ఉద్యోగాల నియామకానికి 54 దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈవో సామల సింహాచలం తెలిపారు. చౌకీదార్-1, వంట మనిషి-1, సహాయకుడు-1 ఉద్యోగాలకు మహిళలు దరఖాస్తు చేశారని, నిబంధనల ప్రకారం పరిశీలించామని చెప్పారు. తదుపరి ఎంపిక కోసం డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట: సీతంపేట మండలం చిన్నబగ్గ పొలిమేరల్లో బుధవారం 600 లీటర్ల పులిసిన బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. తమ సిబ్బందితో కలిసి గ్రామాలకు వెళ్లిన సమయంలో పట్టుబడిందన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు.

తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడికి మాతృ వియోగం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జమదాలకు చెందిన తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడుకి మాతృ వియోగం సంభవించింది. ఆయన తల్లి సింహాచలమ్మ(80) అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే జయకృష్ణ సోదరుడు రాంజీ, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు చంటి, చంద్రమౌళి, సర్పంచి రెడ్డి భారతి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

సంగంవలస సర్పంచి మృతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సంగంవలస సర్పంచి బడే చిట్టినాయుడు (78) అనారోగ్యంతో మరణించారు. బుధవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైకాపా నాయకులు పాల్గొని బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు.

నిబంధనల మేరకు దుకాణాల నిర్వహణ



దస్త్రాలు పరిశీలిస్తున్న జేసీ శోభిక

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు మద్యం దుకాణాలను నిర్వహించాలని సంయుక్త కలెక్టరు శోభిక అబ్కారీ శాఖ సిబ్బందికి సూచించారు. బుధవారం జోగింపేటలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని పరిశీలించారు. దుకాణంలోని నిల్వలు, దస్త్రాల్లో నమోదు చేసిన నిల్వలను సరి చూశారు. నూతన మద్యం విధానం ప్రకారం అన్ని రకాల సరకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆమెతోపాటు అబ్కారీ, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలం నీలకంఠాపురంలో రూట్స్ సంస్థ సహకారంతో శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 112 మందిని పరీక్షించి 42 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని ప్రత్యేక వాహనంలో ఆసుపత్రికి పంపించినట్లు రూట్స్ సంస్థ కార్యదర్శులు ఎ.వినోద్‌కుమార్, సువ్వాన సోనియా తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్ మేనేజర్ రమాదేవి, వైద్యులు తరుణ్, సురేష్, మాజీ ఎంపీపీ నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రికి పయనమైన రోగులు

ఇంకుడు గుంతలతో జలసంరక్షణ



భూమి పూజలో పాల్గొన్న తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ పాండురంగ

వీరఘట్టం, న్యూస్‌టుడే: ఇంకుడు గుంతలు తవ్వడం ద్వారా వృథా జలాలను సంరక్షించుకోవచ్చని తోటపల్లి ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగారావు అన్నారు. ఎం.రాజపురంలో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంత నిర్మాణానికి చేసిన భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, ఇంజినీరింగ్ అధికారిణి డి.కళ్యాణిదుర్గ, ఏపీవో జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: అన్నదాత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడ్రక మల్లీశ్వరరావు అన్నారు. బుధవారం గుణద గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మాట్లాడారు. గత అయిదేళ్లు వైకాపా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాయితీ పరికరాలు అందించేందుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఏవో ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మల్లీశ్వరరావు